# సమ్మక్క సారలమ్మ జాతర సమీపాన్ని సందర్శించిన గోదావరిఖని ఏసీపీ

పెద్దపల్లి, రామగుండం, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: గోలివాడ గోదావరి నది సమీపంలోని సమ్మక్క సారలమ్మ జాతర ప్రదేశాన్ని బుధవారం గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్ రావు పరిశీలించారు. జాతర ఏర్పాట్లపై రెవిన్యూ, ఇతరత్రా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమైనారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వచ్చే నెల సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా జాతరలో జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రహదారుల మరమ్మత్తు, పార్కింగ్ స్థలాల గుర్తింపు, త్రాగునీటి ఏర్పాట్లు, స్నానాలు ఘాట్ వద్ద ఏర్పాట్లు, విద్యుత్ లైట్స్ సౌకర్యం, సీసీ కెమెరాలు, వీడియో కెమెరాల ఏర్పాట్లు, ప్రస్తుతం ఉన్న సదుపాయాలు, ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి. యాదగిరి, రామగుండం సిఐ చంద్రశేఖర్ గౌడ్, ఎస్ఐ బి. సంతోష్ కుమార్, సర్పంచ్ డి.రాజేష్, సమక్క సారలమ్మ గద్దెల చైర్మన్ పెంద్రి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మల్లన్న జాతర ఏర్పాట్లు పరిశీలించిన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రిజ్వాన్ పాషా



ఐనవోలు, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ఐనవోలు మల్లన్న దేవాలయంలో 2024 జాతర ఏర్పాట్లను బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రిజ్వాన్ పాషా, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని చేసుకున్న అధికారులను దేవాలయ అర్చకులు, ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివా రిని దర్శించుకున్నారు. అనంతరం సంక్రాంతి జాతర వేడుకల్లో భాగంగా దేవాలయ పరిసరాల్లో పర్యటించి, భక్తుల సౌకర్యాల ఏర్పాట్లపై ఆరా తీశారు. దేవాలయ ప్రాంగణంలోని జాతర పనులు, పెద్దబావి, కూడా వారు నిర్మించిన టాయిలెట్ బ్లాక్ ని పరిశీలించారు. దేవాలయంలో పారిశుద్ధ్య పనులు చేయుటకు కావలసిన సిబ్బందిని, పెద్ద డస్ట్ బిన్స్, వాటర్ సప్లయ్ టంకర్స్ తదితర అంశాలపై దేవాలయ కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావుని అడిగి తెలుసుకున్నారు. పర్యవేక్షణలో కూడా ప్లానింగ్ ఆఫీసర్ అజిత్ రెడ్డి, ఎక్షిక్యూటివ్ ఇంజినీర్ భీమ్ రావు, ఎంపిడిఓ వెంకటరమణ, ఐనవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీనివాస్, ఐనవోలు తహశీల్దార్ విక్రమ్ కుమార్, ఎస్.ఐ అనిల్ కుమార్ ఉన్నారు.

## హక్కుల సాధన కోసం మాదిగలు ఏకం కావాలి

**- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు**



తుంగతుర్తి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: సమాజంలో హక్కుల సాధన కోసం మాదిగలంతా ఏకం కావాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పిలుపునిచ్చారు. బుధవారం తుంగతుర్తి నియోజకవర్గం మోత్కూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (మాస్) వ్యవస్థాపక అధ్యక్షులు మిద్దెపాక రవీందర్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగలు ఇతర వర్గాల కంటే ఎక్కువ శాతం ఉన్నారు. అలాంటి వర్గాలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు అన్ని రంగాలలో మంచి గుర్తింపు ఇవ్వాలని కోరారు. మాదిగలంతా ఏ పార్టీలలో, ఏ కుల సంఘాలలో ఉన్నా సరే, మాదిగల హక్కుల సాధన కోసం అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. అనంతరం సంఘం నాయకులు ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధర్మారపు శ్రీనివాస్, మామిడి ప్రమీల, సూరారపు నిరంజన్, యాదయ్య, గాయాల కుమార్, బొజ్జ రవి, బిర్రు కరుణాకర్, సూరారపు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

**టి.ఎస్.యు.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుమార్**



రాయపర్తి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాయపర్తి మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం
విద్యాశాఖ అధికారి నోముల రంగయ్య చేతుల మీదుగా క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ టీఎస్ యుటిఎఫ్ డైరీ ఉపాధ్యాయులకు సర్వీస్ వ్యవహారాలలో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వానికి తెలియజేస్తూ, సమస్యల పరిష్కారం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు తాటికాయల కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం విద్యావేత్తల సంఘాలతో చర్చించి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రమోషన్లతో కూడిన బదిలీలు త్వరగా చేపట్టాలి, రాబోయే బడ్జెట్ లో విద్యకు అత్యధిక నిధులు కేటాయించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన గౌరవ వేతనం, వంట వండిన బిల్లులు త్వరగా మంజూరు చేయాలని కోరారు. రాయపర్తి మండల అధ్యక్షులు బి. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ పాఠశాలలకు ఇప్పటివరకు ఉన్న విద్యుత్ బిల్లులను ప్రభుత్వం మాఫీ చేయాలి, విద్యుత్ కేటగిరీలను మార్చాలి, పాఠశాలలకు సకాలంలో గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల ప్రధాన కార్యదర్శి జి.మల్లేశం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ అధికారులపై దాడికి పాల్పడిన నేరస్తులు

**- జరిగిన ఘటనపై స్పందించిన మంత్రి సురేఖ**



భద్రాద్రి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: భద్రాద్రి జిల్లా ఇల్లందు ఫారెస్ట్ డివిజన్ రేంజ్ పరిధిలో ఇసుక మాఫియా నేరస్తులు ఫారెస్ట్ అధికారులపై దాడికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. బుధవారం ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిని అటవీ శాఖ అధికారులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఇసుక మాఫియా అడ్డుకునే క్రమంలో నేరస్తులు ఫారెస్ట్ అధికారులపై ట్రాక్టర్ ఎక్కించి చంపడానికి కుట్ర చేశారు. ఇట్టి విషయమై అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. జరిగిన ఘటనపై మంత్రి ఫోన్ ద్వారా సంబంధిత అధికారులను ఆరా తీశారు. విధుల్లో ఉన్న అధికారులపై తిరుగుబాటు సరికాదని మంత్రి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో దోషులు ఎంతటి వారైనా ఉపెక్షించేది లేదని వ్యాఖ్యానించారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఇలాంటి ఘటనలు మరోమారు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి, జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అటవీ ప్రాంతంలో గతంలో జరిగిన దాడుల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలి, ఎలాంటి సహాయ సహకారాలు అవసరమైనప్పుడు వారి దృష్టికి తీసుకురావాలని భరోసా కల్పించారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి తీసుకువెళ్లి, ఎలాంటి చర్యలు తీసుకోవాలో వాటిని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

## నేరాలను కట్టడి చేయాలంటే సమన్వయంతో పని చేయాలి

**- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వరంగల్ కమిషనరేట్ పరిధిలో నేరాలను కట్టడి చేయాలంటే స్థానిక పోలీసులు, కేంద్రబలగాలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి రవాణా విక్రయాలను నియంత్రించేందుకు పోలీసులకు సహాయ, సహకారాలు అందిస్తూ కృషి చేస్తున్న కాజీపేట్ వరంగల్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్స్పెక్టర్లు యం.సంజీవరావు, టి.ఎస్.ఆర్ క్రిష్ణలకు పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఇరు విభాగాల పోలీసులు సమన్వయంతో పనిచేస్తూనే, నేరగాళ్ళ సమాచారాన్ని ఇరువురు పంచుకోవాల్సిన అవసరం వుందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని నేరాలను నియంత్రించడంలో కలిసి పనిచేద్దామని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. స్పెషల్ బ్రాంచ్ ఏసిపి యం.జితేందర్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ పి.దేవేందర్ ఉన్నారు.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వరంగల్ మహానగరంలో చరిత్ర కలిగిన భద్రకాళి దేవస్థానాన్ని బుధవారం మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సందర్శించారు. ఆలయనికి విచ్చేసిన శివరాజ్ సింగ్ చౌహాన్ కి సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి, శేషుభారతి, దేవాలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఆలయ ప్రాంగణంలో ఎదురుగా ప్రతిష్టించిన ఆదిశంకరులు, వల్లభ గణపతిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోకి ప్రవేశించి, భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివరాజ్ సింగ్ చౌహాన్ కి అర్చకులు మహదాశీర్వచనం అందించి, అమ్మవారి శేష వస్త్రములు, తీర్ధ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మర్తినేని ధర్మారావు, వరంగల్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీధర్, విజయచందర్ రెడ్డి, రావుల కిషన్, రంజిత్ తదితరులు వున్నారు

## సింగరేణి పరిధిలో పెండింగ్ భూసేకరణపై కలెక్టర్ సమీక్ష

పెద్దపల్లి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: పెద్దపెల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సింగరేణి పరిధిలో ఉన్న పెండింగ్ భూసేకరణ అంశంపై బుధవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భూసేకరణ అంశంపై అధికారులకు కలెక్టర్ పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో రామగుండం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, సింగరేణి జనరల్ మేనేజర్లు ఆర్జి1 సి.హెచ్. శ్రీనివాస్, ఆర్జి 2 సూర్య నారాయణ, ఆర్జి 3 సుధాకర్ రావు, మంథని డివిజన్ పరిపాలన అధికారి తూము రవీందర్, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్ శ్రీనివాస్, జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య, రామగిరి తహసిల్దార్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులకు అవార్డులు అందించిన డిఎం



నర్సంపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: నర్సంపేట ఆర్టీసీ డిపోకి చెందిన కార్మికులకు బుధవారం డిపో మేనేజర్ కె. ప్రసూనలక్ష్మీ చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ లకు ఆమె అవార్డులు అందజేసి, అభినందించారు. అనంతరం వారు తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసి విధులు నిర్వహిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతీ ఒకరిని ప్రోత్సహించేందుకు అవార్డులు ప్రధానం చేయడం జరిగిందన్నారు. ఆర్టీసీ కార్మికులకు మాట్లాడుతూ ఆర్టీసిలో తమ విధి నిర్వహణలో భాగంగా క్రమశిక్షణ పాటిస్తూ, భాద్యతలు నిర్వర్తించడం వల్ల వారికి గుర్తింపు దక్కిందని ఆనందిస్తున్నారు. వారి వెంట సహాయ మేనేజర్ జె. భవానీ, సూపరింటెండెంట్ వెంకటదాస్ రెడ్డి, ఎన్. వి. రెఢి, శ్రీనివాస్, రావు, రాజు తదితరులు ఉన్నారు.

# శిశుమందిర్ పాఠశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీ

**- పండగ ప్రతిబింబించేలా ముగ్గుల ప్రదర్శన**



పెద్దపల్లి, గోదావరిఖని, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: గోదావరిఖని జవహర్ నగర్ పరిధిలోని సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బుధవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల కుటుంబాలకు నిర్వహించిన పోటీలలో సంక్రాంతి పండుగను ప్రతిబింబించేలా రంగులతో ముగ్గుల పోటీ ప్రదర్శించారు. పాఠశాల అధ్యక్షురాలు సోమారపు లావణ్య అధ్యక్షతన జరిగిన ఈ పోటీలలో గైనకాలజిస్ట్ వనజా రాపోల్, లయన్, అడ్వకేట్ ఏలేశ్వరం చంద్రమౌళి ముఖ్య అతిథులుగా పాల్గొని న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించడంతో పాటు పోటీలో పాల్గొన్న పోటీదారులందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రతిబింబించే విధంగా ముగ్గులు వేయడం ఆశ్చర్యకరం అన్నారు. సంక్రాంతి వేడుకల సందర్భంగా ఇళ్ల ముందు ముగ్గులు వేసుకోవడం తెలుగు సంప్రదాయాలను గుర్తు చేయడం అన్నారు. ప్రతీ పండుగకి ఒక ప్రత్యేకత ఉందని గుర్తు చేశారు. అనంతరం ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి స్వీట్లు పంపిణీ చేసి పండగ సంబరాలు జరుపుకున్నారు. ఈ పోటీల్లో పాఠశాల కార్యదర్శి గంధం రవీందర్, కోశాధికారి నలుమాసు సత్తయ్య, ప్రధానాచార్యులు సుమాంజలి, ఆచార్యులు, మహిళలు, విద్యార్థినీ, విద్యార్థులు, పోషకులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు ఎస్పీకి ఘనంగా వీడ్కోలు



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి:
ములుగు ఎస్పీ గౌస్ ఆలం ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. బుధవారం సాయంత్రం ములుగు జిల్లా పరిధిలో ఆయన రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని ఎస్ఐలు, సీఐలు, పోలీస్ సిబ్బంది ఎస్పీని ఊరేగింపుగా తీసుకెళుతూ పూల వర్షం కురిపించారు. ఇలా జిల్లా పరిధిలోని పోలీసులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

# అడవిని తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు

**- దర్శనమిస్తున్న అపరిశుభ్రత వాతావరణం- విద్యార్థులకు ఎదురవుతున్న తప్పని తిప్పలు**



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు రోజు రోజుకి మరీ అధ్వానంగా తయారవుతున్నాయి. పాఠశాలల పరిసరాలు అపరిశుభ్రత వాతావరణంతో అలుముకున్నాయి. 100 శాతం విద్యార్థుల సంఖ్యతో కళకళలాడిన ప్రభుత్వ పాఠశాలలు బోసిపోయిన పరిస్థితి నెలకొంది. అందాద వందలో 30 శాతం విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. ఆకర్షించే విధంగా వెలువడిన ప్రైవేటు పాఠశాలల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతూ వచ్చింది. దీంతో ప్రైవేట్ చదువులకు అలవాటు పడిన వ్యవస్థ అటుగానే పయనిస్తుంది. దాదాపు గ్రామీణ ప్రాంతాల వారిగా అక్కడక్కడ ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని చెప్పుకునే పరిస్థితి దాపురించింది. విద్యపై గౌరవంతో ఆయా గ్రామాల విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి, ఉత్తీర్ణులు కావాలని కొంతమంది పుణ్యాత్ములు వారి సొంత స్థలాలను పాఠశాలలకు ధారాదత్తం చేశారు. చివరికి వారి కలలు నిర్వీర్యమైన పరిస్థితి చోటు చేసుకుంది. విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిన కారణంగా ప్రభుత్వాలకు సైతం పట్టింపు తగ్గిపోయిందని చెప్పవచ్చు. అందుకు నిదర్శనంగా పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. పిచ్చి మొక్కలు తరగతి గదుల సమీపంలో ఏపుగా పెరిగి, ప్రభుత్వ పాఠశాలలు అడవిని తలపిస్తున్నాయి. పేద మధ్య తరగతి కుటుంబాల్లో జన్మించిన విద్యార్థినీ, విద్యార్థులు చదువుకోవడం తప్పనిసరిగా భావించి ఆర్థిక స్తోమత లేక ప్రైవేటు పాఠశాలల వైపు కన్నెత్తి చూడకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు లేకపోయినప్పటికీ ఎదురవుతున్న లోప పూరిత తిప్పలు తప్పనిసరిగా భరిస్తున్నారు. ముఖ్యంగా బాలికలు తల్లిదండ్రులకు సైతం చెప్పుకునే పరిస్థితి లేని దౌర్భాగ్యపు పరిస్థితులు ఎదుర్కోవడం దారుణమైన సంఘటనగా మారింది. మరుగుదొడ్లు, మూత్రశాలలు పూర్వం నిర్మించిన నిర్మాణాలు కావడంతో సౌకర్యాలు అంతరించిపోయాయి. నీటి వసతి లేక మలవిసర్జన చేయడం ఇబ్బందికరంగా భావించిన బాల బాలికలు ఉపాధ్యాయుల అనుమతి తీసుకుని ఇళ్లల్లోకి వెళ్లి వారి కాలకృత్యాలను తీర్చుకునే పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ కళ్ళ ముందు విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ ఆయా గ్రామాల్లో ఎవరికీ చలనం లేకపోయింది. ఆవేదన కలిగిన తల్లిదండ్రులకు ఆ సమస్యలపై ఎలా ప్రతిఘటించాలో తెలియని పరిస్థితిలో చింతిస్తున్నారు. నిరుపేద కుటుంబాలు జన్మించిన పాపానికి చదువుకోవాలనుకునే విద్యార్థులకు అసౌకర్యాలు ఇప్పటినుంచే భరించే తత్వాన్ని బోధిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. ప్రస్తుతం వారు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యార్థులకు సరైన విద్యను బోధించే అవసరం వారికి లేకపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు నిదర్శనంగా పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాస్ అవడమే కష్టమవుతుంది. జిల్లా వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పరీక్షల్లో తప్పుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఉపాధ్యాయులకు సంబంధించిన పిల్లలు కార్పొరేటు పాఠశాలలో చదువుతున్నారు కాబట్టి వారికి పెద్దగా పట్టింపు లేకపోయింది. అందులో వంటలు చేసే వర్కర్ల పిల్లలు సైతం కార్పొరేట్ పాఠశాలల్లోనే చదువుతున్నారు. దీంతో నాణ్యమైన భోజనం పెట్టే అవసరం వారికి లేకపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అడుపాదడపా ఉండడంతో ఉన్నతాధికారులు పర్యవేక్షించడానికి సంకోషించే పరిస్థితి ఏర్పడింది. ఎలాగూ సమస్యలు ఉంటాయని తెలిసినప్పుడు పర్యవేక్షించడం ఎందుకని వారు నిరాకరిస్తున్నారు. ఇలా ప్రభుత్వాలు, ఉపాధ్యాయులకు, స్థానికులకు, ఎవరికి పట్టించుకోనప్పుడు అరాకోరాగా పాఠశాలలు ఎందుకు నడిపిస్తున్నారన్న విషయమై పలు అనుమానాలు చోటు చేసుకుంటున్నాయి. నాణ్యమైన విద్య బోధించ లేనప్పుడు లక్షల రూపాయల వేతనాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు, నాణ్యమైన భోజనం పెట్టలేనప్పుడు వేల రూపాయలు తీసుకుంటున్న వర్కర్ల వ్యవస్థ ఎవరిని దారి తప్పించేందుకు కొనసాగిస్తున్నారన్న విషయమై చర్చగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న నిరుపేద కుటుంబాల విద్యార్థినీ, విద్యార్థులకు చదువు తప్ప మరో మార్గం లేకపోయింది. ఇలాంటి మధ్యతరగతి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉన్నతాధికారులను పాఠశాలల్లో పర్యటించి సమస్యలపై ఆరా తీసే విధంగా ఆదేశాలు జారీ చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన, నాణ్యమైన భోజనం అందిస్తూ, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేసి, వివిధ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# క్రికెట్ పోటీలను ప్రారంభించిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్




వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ములుగు జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో ఆదర్శ యూత్ వారు బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీలకు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం ఏర్పడుతుందన్నారు. క్రీడల వల్ల క్రీడాకారులు తమ జీవితాల్లో ఏ పని చేసిన గెలవాలని తపన, తాపత్రయం పెరుగుతుందన్నారు. క్రీడలు మానవ జీవితంలో చాలా ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. క్రీడాకారులందరూ ఈ ఆటల పోటీలను మంచి అవకాశంగా భావించి రాణించాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఏర్పాటు చేస్తున్న పోటీల్లో పాల్గొని తమతమ ప్రతిభను కనబరిచి ప్రత్యేక గుర్తింపు పొందాలని సూచించారు. పట్టుదలతో పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయి క్రికెట్ పోటీల్లో ఆడేందుకు అవకాశం ఏర్పరుచుకోవాలన్నారు. వారి వెంట కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ రవిచందర్, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బాదం ప్రవీణ్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు వంగ రవి యాదవ్, ములుగు పట్టణ అధ్యక్షులు చింతనిపుల బిక్షపతి, జడ్పీ కో ఆప్షన్ నెంబర్ రియాజ్ మీర్జా, మండల అధ్యక్షులు చాంద్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లల భరత్ కుమార్, ఓబిసి చైర్మన్ ఓం ప్రకాష్, రేవంత్, మాజీ ఎంపీటీసీ ఇమ్మడి రాజు, గండె శ్రీను, ఎల్లావుల అశోక్, జన్ను రవి, కుద్బుద్దీన్, నదులు రమేష్, గుండబోయిన రమేష్, బోడ రఘు, షకీల్, ఓడ రాజు, ఓరుగంటి అనిల్, బోడ సతీష్, కుక్కల నాగరాజు, క్రికెట్ క్రీడాకారులు, పుల్లేరా సాయికిరణ్, సుదమల్ల శ్రావణ్, రఘు, శ్రీకాంత్, ఆనంద్, రాకేష్, అఖిల్, రాజేష్, నవదీప్, సంతోష్, దిలీప్ తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు మంచి జరుగుతుంది

ఖమ్మం, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ప్రజా పాలనతో పాటు కోరుకున్న ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం మల్లెమడుగులో బుధవారం పల్లె దవాఖాన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంతో పేదలకు మంచి జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను చేసి చూపిస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదల సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వ అధికారులే ప్రజల వద్దకు వస్తారని తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తులతో పేదల న్యాయమైన కోరికలను ఈ ప్రభుత్వం తీర్చుతుందన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసి పోయిందని మాటలు చెప్పి తప్పించుకునే ప్రభుత్వం కాదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పనిసరిగా నెరవేర్చుతామని పొంగులేటి తెలిపారు.

# ఏసీబీ వలలో చిక్కుకున్న రెవెన్యూ అధికారులు




నిర్మల్, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: నిర్మల్ జిల్లా కడెం మండలం తహశీల్దార్ కార్యాలయంలో అదిలాబాద్ ఏసీబీ డిఎస్పి వి.వి. రమణమూర్తి ఆధ్వర్యంలో వల వేశారు. బుధవారం ఏసీబీ స్కెచ్ తెలియని కడెం రెవెన్యూ అధికారులు వారు వేసిన వలలో చిక్కుకున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని కొత్తమదిపడగా గ్రామానికి చెందిన లాసెట్టి రాజన్న తనకున్న 35 గుంటల భూమిని పట్టా చేయడానికి కడెం మండల తహసిల్దార్ రాజేశ్వరి 15 వేల రూపాయల లంచం అడిగేసరికి బాధితుడు 9 వేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం బాధితుడు తనలాంటి పరిస్థితి మరొకరికి రాకూడదని నేరుగా ఆదిలాబాద్ ఏసీబీ అధికారులకు సమాచారం చేరవేశారు. దీంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. వారి ఆధ్వర్యంలో రాజన్న ఒప్పందం కుదుర్చుకున్న 9 వేల రూపాయలు డిప్యూటీ తహశీల్దార్ చిన్నయ్య కు అందజేశారు. ఆయన చేతుల మీదుగా తహసీల్దార్ రాజేశ్వరికి లంచం డబ్బులు ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. లంచం డబ్బులు తీసుకున్న మండల తహసిల్దార్ రాజేశ్వరి, డిప్యూటీ తహసిల్దార్ చిన్నయ్యలను అరెస్టు చేసి ఏసీబీ కోర్టుకు పంపనున్నట్లు అదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ ఎస్ఐలు రవీందర్, జాన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

